ప్రజాశక్తి
మంగళవారం 2 జూలై 2024



పింఛన్ల పంపిణీ ప్రారంభించిన కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు:జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసారు. స్థానిక సంద్రుపుట్టు కాలనీలో సోమవారం చేపట్టిన పింఛన్ల పంపిణీని ఆయన ప్రారంభించారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేసారు. పోతల కొండమ్మ అనే వృద్ధురాలుకు రూ.7 వేలు పంపిణీ చేసారు. రేషన్ అందుతోందా ? ఎన్ని కిలోల బియ్యం ఇస్తున్నారని అడిగి తెలుసు కున్నారు. ఈ కార్యక్రమంలో డి. ఆర్.డి.ఏ పి.డి. వి.మురళి, ఎం.పి.డి.ఓ, సాయి నవీన్, ఇఓ పి ఆర్ డి.రమేష్, సచివాయలం సిబ్బంది, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పంపిణీ చేస్తున్న కలెక్టర్

రేకుల షెడ్డులో చదువుకుంటున్నాం..

పాఠశాల భవనం పూర్తి చేయరూ...

-విద్యార్థుల వినూత్న నిరసన

ప్రజాశక్తి-అనంతగిరి:పాఠశాల భవనం లేక వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, అర్ధాంతరంగా నిలిచిన భవనం పనులు పూర్తి చేయాలని విద్యార్థులు వినూత్న రీతిలో సోమవారం మోకాళ్లపై చేతులు జోడించి నిరసన చేపట్టారు. మండలంలోని వేంగడ పంచాయతీ డొంకపుట్టు ఎంపీపీ ప్రాథమిక పాఠశాలకు భవనం లేదు. దీంతో, చిన్నపాటి రేకు షెడ్డులో విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు. వర్షాకాలంలో గది లోపల వర్షపు నీరు ప్రవేశిస్తుండటంతో కుర్చోలేని పరిస్థితితో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. డాలింగ్ పుట్టు, పెన్నంతి, మరివలస, మెట్టపాడు, డొంకపుట్టు గ్రామాలకు చెందిన 67 మంది విద్యార్థులు డొంకపుటు ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్నారు. పదేళ్ల క్రితం ప్రభుత్వం మంజూరు చేసిన పాఠశాల పనులు గోడ వరకు చేపట్టి నిలిపి వేశారు.పాఠశాల భవనం ఏర్పాటు చేయాలని ప్రజాశక్తి దినపత్రికలో కథనాలు రావడంతో స్పందించిన ఐటీడీఏ పిఒ పాఠశాల నిర్మాణానికి సుమారు ఆరు లక్షల రూపాయల నిధులు 2023 సంవత్సరంలో మంజూరు చేశారు. కాంట్రాక్టర్ పనులు ప్రారంభించగా బిల్లులు అందకపోవడంతో భవనం పనులను నిలిపివేశారు. పాఠశాల భవనం పనులు పూర్తి చేయాలని సీపీఎం మాజీ సర్పంచ్ సివేరి కొండలరావు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాల భవనం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు పనులు పూర్తి చేయాలని, లేకుంటే పాడేరు కలెక్టరేట్ వద్ద విద్యార్థులతో ఆందోళ చేస్తామన్నారు.



మోకాళ్లపై నిరసన చేపడుతున్న విద్యార్థులు



రేకుల షెడ్డులో చదువుకుంటున్న విద్యార్థులు



ఆసుపత్రికి వచ్చిన విద్యార్థులు

జ్వరాలతో విద్యార్థులు విలవిల

ప్రజాశక్తి -హుకుంపేట:మండలంలోని సుకూరు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు పాఠశాల విద్యార్థులు జ్వరాలతో బాధపడుతున్నారు. సోమవారం ఈ విద్యార్థులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చారు. సుకూరు పాఠశాల జ్వరాలతో బాధపడుతున్న విద్యార్థులు ఎస్.సింహాద్రి, ఎస్.కైలాస్, వి సింహాద్రి, ఎస్. వరుణ్ సందేశ్, వి. శామ్యూల్, కె. సిద్ధు, సంతోష్, యు.కృష్ణబాబు, ఆనంద్, కె. అరుణ్, పి. ఏలీయాలు ఉన్నారు. వీరంతా స్థానిక పిహెచ్‌సికి వచ్చారు. పాఠశాలలో హెల్త్ అసిస్టెంట్ నియామకాలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పాఠశాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయక పోవడంతో విద్యార్థులు చికిత్స కోసం ఆరోగ్య కేంద్రానికి తరలి వస్తున్నారు. ఐటీడీఏ అధికారులు విద్యార్థుల ఆరోగ్య పట్ల శ్రద్ధ వహించి పాఠశాలల్లో హెల్త్ అసిస్టెంట్ల నియామకాలపై దృష్టి సాధించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.పాఠశాలలోనే వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి తాపుల కృష్ణారావు డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, ఐ టి డి ఏ ప్రాజెక్టు అధికారి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు విద్యార్థుల ఆరోగ్యం పట్ల బాధ్యత వహించి పాఠశాలలో హెల్త్ అసిస్టెంట్ల నియామకం చేపట్టాలన్నారు.



ప్రజల సమస్యలు వింటున్న సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

'పబ్లిక్ గ్రీవెన్స్'కు 57 దరఖాస్తులు

ప్రజాశక్తి-రంపచోడవరం

స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వివిధ సమస్యలపై 57 దరఖాస్తులు వచ్చాయి. వీటిని సంబంధిత ప్రజల నుండి రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్, ఐటిడిఎ ఏపీవో జనరల్ సిహెచ్.శ్రీనివాసరావు స్వీకరించారు. మారేడుమిల్లి మండలం పాములేరు పంచాయతీ పరిధిలో కుట్రవాడ నుండి పాములేరు వరకు, పుల్లంగి నుండి ముచ్చెలవాడ వరకు, మారేడుమిల్లి మండలంలోని భద్రాచలం వెళ్లే మెయిన్ రోడ్డు నుండి కొండవాడ వరకు, కుట్రవాడ నుండి ఎలువాడ వరకు తారు రోడ్డు వేయాలని, ఎలువాడ నుండి అర్జున్‌లో వరకు మెటల్ రోడ్డు, కుట్రవాడ సచివాలయ పరిధిలో సిసి రోడ్లు ఏర్పాటు చేయాలని పాములేరు సర్పంచ్ సార్ల రమాదేవి, సార్ల మంగిరెడ్డి, కత్తుల సుబ్బిరెడ్డి దరఖాస్తు సమర్పించారు. రంపచోడవరం మండలం ఇసుకపట్ల గ్రామంలో సీసీ రోడ్లు, లింకు రోడ్లు, తాగునీటి కోసం వాటర్ ట్యాంక్ నిర్మించాలని, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని, గిరిజన రైతులకు వివిధ రకాల విత్తనాలు సరఫరా చేయాలని, వాడపల్లి ప్రాథమిక ఆసుపత్రిలో అన్ని వ్యాధులకు మందులు అందుబాటులో ఉంచాలని వాడపల్లి సర్పంచ్ అన్నిక పండమ్మ, కత్తుల లచ్చిరెడ్డి, కత్తుల మూర్తిరెడ్డి వినతిపత్రం ఇచ్చారు. వై రామవరం మండలం ఎగువ ప్రాంతంలోని గుర్తేడు ఆశ్రమ పాఠశాలలో ఐదో తరగతి వరకు బాలికలను హాస్టల్లో కొనసాగించాలని, వట్టిగడ్డ స్కూల్ భవనానికి మరమ్మతులు చేయించాలని, రావడికోట గ్రామంలో అంగన్వాడి కేంద్రం, స్కూలు ఏర్పాటు చేయాలని, గుర్తేడు, పాతకోట పంచాయతీల గిరిజనులు రాకపోకలకు మరో ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేయాలని గుర్తేడు సర్పంచ్ గొర్లె దుష్యాంతుడు అర్జీ ఇచ్చారు. తను ఇంటర్మీడియట్ చదివి ఖాళీగా ఉంటున్నానని, గంగవరం మండలం ముల్లేరు గ్రామ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ ఖాళీగా ఉందని, తనకు ఆ పోస్టులో ఇప్పించాలని గంగవరం మండలం మొల్లేరు గ్రామానికి చెందిన మిర్తివాడ నిర్మలాదేవి దరఖాస్తు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాన్ రాజ్, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, ఏడియంహెచ్ఓ జి.శిరీష, ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, వెలుగు ఏపిడి ఎ.శ్రీనివాసరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మన్యంలో దోమల నివారణకు చర్యలు

-డి ఎం అండ్‌హెచ్‌ఓ జమాల్ బాషా

ప్రజాశక్తి-పాడేరు:జాతీయ కీటక జనీత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా పాడేరు మండలం గబ్బంగి పంచాయితి దాలింపుట్టు, గబ్బంగి గ్రామాలలో జిల్లా వైద్య అధికారి జమాల్ బాషా రెండవ విడత దోమల నివారణ కార్యక్రమాన్ని మలేరియా సిబ్బందితో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నీటి తొట్టెలు, పూలకుండిల్లో నీరు నిలవ ఉండటంతో డెంగ్యూ, మలేరియా దోమలు పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎమ్ఓ డి శేషయ్య, ఎస్‌యుఓ ధనుంజయ్, మూర్తి, హెచ్ఎ శంకర్, ఆశ వర్కర్లు కాసులమ్మ, పూర్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

డయేరియాపై ప్రచారం

పాడేరు:రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న స్టాఫ్ డయేరియా కార్యక్రమాన్ని అల్లూరి సీతారామరాజు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జమల్ భాష జిల్లా పరిధిలోని చింతల వీధి ఆరోగ్య ఉప కేంద్రం, గురుకుల పాఠశాలల్లో సోమవారం ప్రచారం చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్టాఫ్ డయేరియా అనే కార్యక్రమానికి మీ అందరూ సహకార%శీ% అందించాలని ఈరోజు నుండి రెండు నెలల పాటు ఈ కార్యక్రమం పై అవగాహనను మా సిబ్బంది కల్పిస్తారని దాన్ని ప్రజలందరూ తప్పకుండా పాటించాలని చెప్తూ... ప్రతి ఇంట్లో అప్పుడే పుట్టిన బిడ్డ నుండి ఐదు సంవత్సరంలోపు పిల్లలందరికీ ఆకస్మికంగా విరోచనాలు రావడం, తీవ్రమైన కడుపు నొప్పి రావడం లక్షణాలు కనిపిస్తే వెంటనే స్థానికంగా ఉన్న ఆశా వర్కర్ ని సంప్రదించాలని ఆ తదుపరి ప్రాథమిక వైద్యం అందిన తర్వాత కూడా తగ్గకపోతే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లాలని, ప్రతి ఇంట్లో ఓ ఆర్ ఎస్ ప్యాకెట్టు ఉంచుకోవాలని, ఓఆర్ఎస్ తయారు చేసే విధానాన్ని అవగాహన కలిగి ఉండాలని. తల్లులకు ప్రజలకు సూచించారు. గురుకుల బాలికల పాఠశాలల్లో విద్యార్థులకు పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. విద్యార్థుల చేత హ్యాండ్ వాష్ చేసే విధానాన్ని చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో డి .ఎల్ ఓ డాక్టర్ సాధన, వైద్యాధికారి రాణా ప్రతాప్, ప్రిన్సిపల్ గణేష్, హెల్త్ సిబ్బంది శెట్టి నాగరాజు, కష్ణవేణి, సంధ్య పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డి ఎం అండ్‌హెచ్‌ఓ జమాల్ బాషా



వర్షానికి కొట్టుకుపోయిన రహదారి ఇదే..

వర్షాలకు కొట్టుకుపోయిన రహదారి

ఇబ్బంది పడుతున్న మూడు గ్రామాల ప్రజలు

ప్రజాశక్తి-కొయ్యూరు

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొయ్యూరు మండలంలోని డేకురాయి, టెంకలపణుకులు, పారికలు తదితర గ్రామాలకు వెళ్లే రహదారి కొట్టుకుపోయింది. రహదారి మొత్తం గోతులు ఏర్పడ్డంతో పాటు పిల్ల కాలువల్లా మారింది. నెల రోజుల క్రితమే ఆయా గ్రామాలకు గ్రావెల్ రోడ్డు వేసినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇంతలోనే వర్షాలకు రోడ్డు పలుచోట్ల పూర్తిగా కొట్టుకుపోయి అధ్వానంగా మారిందని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి తమ గ్రామాలకు వెళ్లే రహదారిని పునర్నిర్మించాలని కోరుతున్నారు.



చింతపల్లిలో పట్టుబడిన నిందితుడితో పోలీసులు

వేర్వేరు చోట్ల 414 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-యంత్రాంగం

విశాఖపట్నం, అల్లూరి జిల్లాల్లో వేర్వేరు చోట్ల సోమవారం 414 కిలోల గంజాయిని పట్టుకున్నారు.

చింతపల్లి : ఒడిశా రాష్ట్రం నుంచి అల్లూరి జిల్లా మీదుగా మైదాన ప్రాంతానికి అక్రమంగా తరలించేందుకు సిద్ధం చేసిన 254 కిలోల గంజాయిని చింతపల్లి పోలీసులు పట్టుకున్నారు. చింతపల్లి మండలం అంజలి శనివారం పంచాయతీ పరిధిలోని మారుమూల గ్రామమైన కొత్తమాడెం బంధ సమీప అటవీ ప్రాంతంలో గంజాయిని ఉంచి అక్కడి నుంచి తరలించేందుకు సిద్ధం చేస్తున్న వచ్చిన సమాచారం మేరకు చింతపల్లి పోలీసుస్టేషన్ సిఐ రమేష్, ఎస్ఐ అరుణ్‌కిరణ్, హెడ్ కానిస్టేబుల్ ధనుంజయ్, తమ సిబ్బందితో ఆ ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడున్న 254 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒకరిని అదుపులోకి తీసుకున్నారు.

పెదబయలు : పెదబయలు మండలం సీతగుంట జంక్షన్ వద్ద సోమవారం పోలీసులు తనఖీలు చేపట్టారు. రెండు ద్విచక్రవాహనాలతో 150 కిలోల గంజాయిని తరలిస్తూ నలుగురు పట్టుబడ్డారు. ఘటనకు సంబంధించి పెదబయలు ఎస్ఐ పులి మనోజ్‌కుమార్ మాట్లాడుతూ, ఒడిశా నుంచి రూడకోట, కుజబంగి మీదుగా సీతగుంట వైపు గంజాయి తరలిస్తున్నట్లు ముందస్తుగా వచ్చిన సమాచారం మేరకు వాహన తనిఖీ చేపట్టామని తెలిపారు. గంజాయి తరలిస్తున్న ముంచంగిపుట్టు మండలం కర్రిముక్కిపుట్టు పంచాయతీకి చెందిన బలడ (28), ఒడిశా రాష్ట్రం మల్కాన్‌గిరి జిల్లాకు చెందిన వంతల అర్జున్, ఖిల్గో, గుత్సనోపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గాజువాక చైతన్యనగర్‌లో 10 కిలోలు పట్టివేత

గాజువాక : విశాఖ జిల్లా గాజువాక చైతన్య నగర్‌లోని జయంతి అపార్ట్‌మెంట్‌లో 10 కిలోల గంజాయిని గాజువాక పోలీసులు పట్టుకున్నారు. జయంతి అపార్ట్‌మెంట్‌లో ప్రయివేటు హాస్టల్‌ను తోట రాజేష్ నడుపుతున్నారు. ఇతను గంజాయిని తెచ్చి కావలసిన వారికి సరఫరా చేస్తున్నారు. ముందస్తు సమాచారం సోమవారం పోలీసులు తనిఖీ చేయగా 10 కిలోల గంజాయి పట్టుబడింది. రాజేష్‌తో పాటు ఏడుగురిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

'రక్షణ కల్పించాలి'

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :ఒంటరి మహిళనైన తనకు రక్షణ కల్పించాలని స్థానిక మున్సిపల్ చైర్ పర్సన్ సుబ్బలక్ష్మి మీడియాతో మాట్లాడుతూ ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం జరిగిన ఫించను పంపిణీలో సామాన్యురాలిలా తనకు పింఛను ఇచ్చారని, ఇది ఎంతో బాధకలిగించిందన్నారు. నా మీద ఎవరైనా దాడికి ప్రయత్నించే అవకాశం ఉందని, అందుకే పోలీసులను ఆశ్రయిస్తానన్నారు. తాను ఎప్పుడు అయ్యన్న కుటుంబాన్ని దూషించలేదని తెలిపారు.

చినుకు పడితే చిత్తడే..

అధ్వానంగా అంతర్గత రోడ్లు

ప్రజాశక్తి-చింతూరు

చింతూరు డివిజన్ కేంద్రంలోని బిసి కాలనీ, గొల్ల బజారు, వాడ బజారు ప్రాంతాల్లో అంతర్గత రహదారులు చినుకు పడితే చిత్తడిగా మారుతున్నాయి. పది సంవత్సరాలుగా ఇదే పరిస్థితి ఉండడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వైసిపి ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం అంతర్గత రోడ్లును మంజూరు చేసినప్పటికీ నిధులు విడుదల చేయలేదు. అయితే రోడ్ల నిర్మాణం కాకపోవడం 2024 ఎన్నికలపై ప్రభావం ఉంటుందని భావించిన వైసిపి నాయకులు తమ సొంత డబ్బులతో ఎన్నికలకు ముందు కొన్ని రోడ్లపై గ్రావెల్, కొన్ని రోడ్లపై కంకర వేసి ఎన్నికల కోడ్ వచ్చిందని, ఎన్నికల అనంతరం రోడ్లు పూర్తి చేస్తామని చెప్పి పనులు నిలుపుదల చేశారు. ఎన్నికల ఫలితాలు తారుమారు కావడంతో రోడ్ల నిర్మాణం సాగే పరిస్థితి కనిపించలేదు. దీంతో మళ్లీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా బురదతో పెద్దపెద్ద గోతులతో రోడ్లు దర్శనమిస్తున్నాయి. వైసిపి ప్రభుత్వం ఐదు సంవత్సరాల కాలంలో రోడ్లు వేయకుండా ఎన్నికల ముందు పనులు చేపట్టడంతో ప్రజల్లో నమ్మకం సన్నగిల్లింది. కేవలం రాజకీయ లబ్ధి కోసమే పనులు ప్రారంభించారని ప్రజలు భావించారు.

ఇప్పుడు వరదల కాలం రానే వచ్చింది. రహదారులు మాత్రం గోతులు మయంగా ప్రమాదకరంగా ఉన్నాయి. చింతూరులోని గుబేలుపేట నుండి రామాలయం మీదుగా ఎర్రంపేటకు రహదారి కల్పించాలని ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు ఏమాత్రం పట్టించుకోలేదు. గుబేలుపేట గుండా సుమారు 500 కుటుంబాలు వరదల ముంపు సమయంలో రామాలయం రోడ్డు ద్వారా సురక్షిత ప్రాంతాలకు వెళ్లే రోడ్డును మాత్రం ఎవరూ పట్టించుకోలేదు. కొత్త ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని అంతర్గత రహదారుల నిర్మాణం చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



వర్షానికి అధ్వానంగా మారిన చింతూరు రహదారి

సిసి రోడ్డు నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని పెద్దమట్టపల్లి పంచాయతీ పరిధి తమ్మాయిపేట గ్రామంలో రూ.9 లక్షలతో చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణ పనులను సోమవారం స్థానిక సర్పంచ్ వెట్టి లక్ష్మి, సిపిఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మి మాట్లాడుతూ మూడు అడుగుల వెడల్పుతో వంద మీటర్లు పొడుగునా ఈ రోడ్డు వేయటం జరుగుతుందని చెప్పారు. గుత్తేదారులు నాణ్యత లోపం లేకుండా రోడ్డు నిర్మాణం చేయాలని, త్వరగా పూర్తి చేయాలని కోరారు. మండలంలోని పలు గ్రామాల నుండి ఈ గ్రామానికి వ్యవసాయదారులు, ప్రజలు నిత్యం తిరుగుతుంటారని, ఇది రైతులకు చాలా ఉపయోగంగా ఉంటుందని పేర్కొన్నారు. గతంలో గోతులతో వాహనాలు తిరిగే పరిస్థితి లేదని, రైతుల ప్రజలు బాధలు అర్థం చేసుకొని అధికారులతో మాట్లాడి ఈ రోడ్డు మంజూరు చేయించినట్లు సర్పంచ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ, మండల నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



సిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ లక్ష్మి, సిపిఎం నాయకులు

అర్హులైన రైతులందరికీ విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం 90 శాతం సబ్సిడీపై సరఫరా చేస్తున్న వరి విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి డి.ఉమాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలి విడతలో వచ్చిన విత్తనాలను ఇప్పటికే పంపిణీ చేశామని, రెండో దఫాగా వచ్చిన సుమారు 134 క్వింటాళ్ల విత్తనాలను ఆయా రైతు భరోసా కేంద్రాల వద్ద తమ సిబ్బంది రైతులకు పంపిణీ చేస్తున్నారని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఉమాదేవి

ఘనంగా డాక్టర్స్‌డే వేడుకలు

ప్రజాశక్తి-రంపచోడవరం

స్థానిక ఏరియా ఆసుపత్రిలో స్టాఫ్ నర్సులు, హెడ్ నర్సులు, శానిటేషన్, ఆరోగ్యశ్రీ, ల్యాబ్ టెక్నీషియన్లు, కౌన్సిలర్లు, ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్, ఇతర సిబ్బంది డాక్టర్స్ డే వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, ఆసుపత్రిలోని వైద్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వైద్యులు మాట్లాడుతూ ఆసుపత్రిలో పని చేస్తున్న వైద్యులు, అన్ని విభాగాల సిబ్బంది కలిసి అంకిత భావంతో పనిచేయాలని కోరారు.



కేక్ కట్ చేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది

వాడవాడలా పింఛన్ల పంపిణీ


దుంబ్రిగుడలో....


రాజవొమ్మంగిలో ...

ప్రజాశక్తి-యంత్రాంగం

దుంబ్రిగుడ: మండలంలోని రంగిలిసింగి పంచాయతీ కుజబంగిలో టిడిపి యూనిట్ ఇన్చార్జి జక్కయ్య, బూత్ ఇన్చార్జులు ధర్మారావు, దామోదర్, నారాయణమూర్తి, గంగాధర్ పంపిణి చేశారు. కొర్రాయి పంచాయతీలో స్థానిక సర్పంచ్ పి.కోములు, జనసేన పార్టీ నాయకుడు లక్ష్మణరావుల చేతులు మీదుగా పంపిణీ చేపట్టారు. ఖంద్రుమ్ పంచాయతీలో సర్పంచ్ కే హరి, పోతంగి పంచాయతీలో స్థానిక ఎంపీడీవో జయ ఉమా, టిడిపి మండల నాయకుడు ఎం స్వామి పంపిణీ చేశారు.

హుకుంపేట:మండలంలోని కొట్నాపల్లి పంచాయతీలో సోమవారం పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అభిషేక్, ఎంపీడీవో ఆర్ వెంకట్రావు, హౌసింగ్ ఏఈ శంకర్రావు, ఏపిఎం చిన్నారావు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: మండలంలోని 23 పంచాయితీలలో పింఛనుదారులకు ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశామని ఎంపిడీవో కే.కిరణ్ కుమార్ తెలిపారు. గృహాలలో అందుబాటులో లేని పింఛనుదారులకు మంగళవారం ఉదయం పంపిణీ చేస్తామని ఆయన వెల్లడించారు.

పెదబయలు: సీతగుంట, అడుగుల పుట్టు తదితర పంచాయతీల్లో పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి మాధవరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రాజవొమ్మంగి:ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి మండలంలోని లబ్బర్తి గ్రామంలో సోమవారం ప్రారంభించారు. లబ్బర్తి, దూసరపాము, రాజవొమ్మంగి, జడ్డంగి, అడ్డతీగల మండలంలోని రాజుంపాలెం, పాపంపేట అడ్డతీగల, వేటమామిడి, గంగవరం మండలంలోని గంగవరం తదితర గ్రామాల్లో లబ్ధిదారులకు ఎమ్మెల్యే పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగు యువత నియోజకవర్గం అధ్యక్షులు విజయభాస్కర్, మండల నాయకులు జి.పెద్దిరాజు, ఎం.డింబకేశ్వరరావు, దంతులూరి శివరామచంద్రరాజు, ఘనజాల తాతారావు, బి.త్రిమూర్తులు, తాము సూరిబాబు పాల్గొన్నారు.

రంపచోడవరం : మండలంలోని బి.వెలమలకోట, బీరంపల్లి గ్రామాల్లో పింఛన్లను మాజీ ఎమ్మెల్యేలు వంతల రాజేశ్వరి, సీతంశెట్టి వెంకటేశ్వరరావు పంపిణీ చేశారు. దీనికి ముందు మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టి.రామారావు విగ్రహానికి, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్ర పటాలకు పాలభిషేకం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పూల మందేశ్వరరావు, కారం శేషాయమ్మ, సర్పంచ్‌లు వంతల అచ్చియమ్మ, సోడే నూకరాజు దొర, ఇతర నాయకులు పాల్గొన్నారు.

మోతుగూడెం : చింతూరు మండలం, మోతుగూడెం పంచాయితీ పరిధిలో సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు వాగ్దానం మేరకు పెంచిన పింఛన్లు పంపిణీ చేశారు.

మారేడుమిల్లి : మండలంలోని మారేడుమిల్లి గ్రామంలో సంత మార్కెట్, వీడియో సెంటర్, సోమిరెడ్డి పాలెం, పాత పంచాయతీలో టిడిపి నాయకులు, సచివాలయ సిబ్బంది పింఛన్ల పంపిణీ చేశారు. ముందుగా మారేడుమిల్లి ప్రధాన కూడలిలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు శేషు కుమార్, రాజ్ కుమార్ రెడ్డి, మల్ల దుర్గాప్రసాద్, భీసెట్టి అప్పాజీ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

విఆర్.పురం : మండలంలోని రామవరం పంచాయతీ రామవరం, ముల్కనపల్లి, పంచాయతీ జల్లివారి గూడెం, రేకపల్లి పంచాయతీ ఉమ్మడివరం గ్రామాల్లో లబ్ధిదారులకు ఎంపీపీ కాలం లక్ష్మి, ఆయా పంచాయతీల సర్పంచ్‌లు కారం బుచ్చమ్మ, సవలం మారయ్య, పూనం సరోజినీ, సిపిఎం నాయకులు సోమవారం పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పూనం సత్యనారాయణ, వంకు సత్తిబాబు, కారం సుందరయ్య, టిడిపి నాయకులు బుర్కా కన్నారావు, ప్రకాష్, సచివాలయ కార్యదర్శులు తాతారావు, శివప్రసాద్, రమణ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని వడ్డిగూడెం, విఆర్ పురం గ్రామాల్లో పింఛన్ల పంపిణీని తహాశీల్దారు పరిశీలించారు.

కూనవరం : మండలంలోని కూటూరు, పెద్దర్కూర్ పంచాయతీల్లో పింఛన్లను సచివాలయ సిబ్బంది సోమవారం పంపిణీ చేశారు.

సీలేరు : జీకే.వీధి మండలం సీలేరులో సామాజిక పింఛన్ల పంపిణీని టిడిపి, బిజెపి, జనసేన నాయకులు సోమవారం ఉదయం ప్రారంభించారు. ముందుగా మోడీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు ఆయా పార్టీల నాయకులు నక్క తిరుమలరావు, వనమల రాము పాలాభిషేకం చేశారు. అనంతరం పింఛన్లు పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వి.శ్రీనివాస్ నాయకులు ఎన్.నాథవరావు, చిటికెల రాము, బాలు పాల్గొన్నారు. దారకొండ పంచాయతీలో 60 శాతం, గుమ్మిరేవులులో 75శాతం పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. జికె.వీధి మండలం జెర్రెల పంచాయతీలో 26 మంది లబ్ధిదారులకు కూటమి నాయకులు పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బాబురావు, పుత్తూరు విష్ణుమూర్తి, వెంకటేష్, బలరాం పాల్గొన్నారు.

కొయ్యూరు : మండలంలోని కొయ్యూరు గ్రామంలో పింఛన్ల పంపిణీ కూటమి నేతలు సోమవారం ప్రారంభించారు. ముందుగా మోడీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. స్థానిక సర్పంచ్ మాకాడ బాలరాజు, టిడిపి నాయకులు ఎంవీవీ ప్రసాద్ పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు తోట దొరబాబు, కురుజు శ్రీను బాబు, అనిశెట్టి చిరంజీవి, మెడిబోయిన చిన్న, గాలి దేవుడు, బొంకు రామకృష్ణ పాల్గొన్నారు.

రహదారుల పనులకు అత్యంత ప్రాధాన్యత

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్


మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు: రహదారుల నిర్మాణ పనులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ స్పష్టం చేసారు. జిల్లాలో జరుగుతున్న ఇంజనీరింగ్ పనులపై గిరిజన సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్ శాఖ, రహదారులు భవనాల శాఖ ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం సమీక్షించారు. రంపచోడవరం, చింతూరు డివిజన్ల అధికారులతో వర్చువల్ విధానంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటి వరకు మంజూరు చేసిన పనులు ఎన్ని? ఎన్ని పనులు పూర్తి చేసారు ? ఎన్ని పనులు పురోగతిలో ఉన్నాయని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లను అడిగి తెలుసు కున్నారు. పనులు ప్రారంభించక పోవడానికి గల కారణాలపై ఆరా తీసారు. క్షేత్ర స్థాయిలో ప్రజలకు ఉపయోగ పడే పనులను గుర్తించి ప్రతిపాదనలు చేయాలని ఆదేశించారు. ఇంజనీరింగ్ పనులకు పకడ్బందిగా డేటాను సిద్ధం చేయాలని సూచించారు. గ్రామాలకు పనులు ప్రతిపాదించేటప్పుడు, అవసరాన్ని గుర్తించి జనాభా ప్రాతిపదికన పనులు చేపట్టాలని చెప్పారు. రహదారులకు వినియోగిస్తున్న మెటీరియల్ వివరాలను, నాణ్యతలపై ఆరాతీసారు. ప్రాధన్యతా క్రమంలో కాంట్రాక్టర్లందరకి సమానంగా బిల్లులు చెల్లించాలని ఆదేశించారు. బిల్లులు చెల్లించిన తరువాత పనులు చేయకపోతే సంబంధిత కాంట్రాక్టకు భవిష్యత్తులో పనులు అప్పగించ వద్దని చెప్పారు. గోకులం పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకుని రావాలని పేర్కొన్నారు. ఐటిడిఏ ప్రాజెక్టు అధికారులు ఇంజనీరింగ్ పనులను తనిఖీ చేయాలని సూచించారు. గిరిజన సంక్షేమ శాఖలో ఉపాధి హామీ పనులు, ఆర్టికల్ 275 పనులు, సిసిడిపి ఎస్.సి. ఎ. పనులపై గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారులు వివరించారు. ఈ సమావేశంలో పాడేరు ఐటిడిఏ పిఓ వి.అభిషేక్, రంపచోడవరం పిఓ సూరజ్ గనోరీ, చింతూరు పి.ఓ చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వాలు రెన్యువల్ చేసుకోవాలి

ప్రజాశక్తి-హుకుంపేట:ఏపీ గిరిజన విలేకరుల సేవా సంఘం మండల కమిటీ సభ్యులందరూ యూనియన్ లో సభ్యత్వం రెన్యువల్ చేసుకోవాలని పాడేరు డివిజన్ కార్యదర్శి పి.సూర్యారావు సూచించారు.మండల కేంద్రంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ముందుగా సంఘం బలోపేతం, కార్యచరణ, సభ్యత్వాలు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం సూర్యారావు మాట్లాడుతూ. సంఘం బలోపేతానికి అందరు కృషి చేయాలన్నారు. విలేకరుల సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి సభ్యులు సునీల్, రాజు, హుకుంపేట మండల కమిటీ సభ్యులు, ఆనంద్, పండు, నాగరాజు, శ్రీను, అఖిల్, చిట్టిబాబు, కొండబాబు పాల్గొన్నారు.

జీపు బోల్తా

ప్రజాశక్తి -పెదబయలు: మండల సమీపంలో ముర్జలబంద మెయిన్ రోడ్డు మలుపు వద్ద సోమవారం పెదబయలు వస్తున్న జీపు బోల్తా పడింది. కొరవంగి గ్రామానికి చెందిన కొరవంగి శివ కుమారికి తీవ్ర, మిగతా వారికీ స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి ప్రైవేట్ ఆటోలో పెదబయలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం పాడేరు ఏరియా హాస్పిటల్ కు తరలించారు

విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-పాడేరు:నీట్ పరీక్ష పేపర్ లీకేజీను నిరసిస్తూ ఈనెల 4న పిలుపునిచ్చిన విద్యా సంస్థల బందును జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కార్తీక్, పి. జీవన్‌కృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ, దేశ చరిత్రలో ఏనాడు లేని విధంగా ఈ సంవత్సరం అవకతవకలు జరిగాయని విమర్శించారు. నీట్ పరీక్ష నిర్వహించే ఎన్ టి ఏను రద్దు చేయాలన్నారు.బాధిత విద్యార్థులు కేంద్ర విద్యా శాఖ మంత్రికి మొరపెట్టుకున్నా ఎటువంటి స్పందన లేకపోవడం దారుణమని విమర్శించారు.నీట్ పరీక్ష పత్రాల లీకులకు కారణమైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని పరీక్ష రాసి నష్టపోయిన విద్యార్థులకు నష్టపరిహారం చెల్లించి, కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలన్నారు.4వ తేదీన అల్లూరి స్ఫూర్తితో బాధిత విద్యార్థులకు న్యాయం జరిగే వరకు ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. జిల్లాలో అన్ని విద్యాసంస్థలు, విద్యార్థులు బందును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో శిశువు చర్మాన్ని కాపాడుకోవాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వర్షాకాలంలో శిశువు చర్మాన్ని కాపాడుకోవాలని మారికో లిమిటెడ్ చీఫ్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ శిల్పా వోరా సూచించారు. పెరిగిన తేమ, తడిదనం చిన్నపిల్లల రోగనిరోధక శక్తిని తగ్గించడమే కాకుండా దద్దుర్లు, చర్మం ఎరుపెక్కడం, ఇన్ఫెక్షన్ల వంటి వివిధ చర్మ సమస్యలను కూడా కలిగిస్తాయని వివరించారు. ఒక హోటల్లో ఆమె మీడియాతో మాట్లాడుతూ శిశువు చర్మం చాలా సున్నితంగా, పెద్ద వారి కంటే 30 శాతం సన్నగా ఉంటుందన్నారు. తక్కువ లిపిడ్లతో, పెళుసుగా, పొడిగా ఉండేలా చేస్తుందన్నారు. వర్జిన్ కొబ్బరి నూనె శిశువు మదువైన చర్మాన్ని సున్నితంగా ఉంచుతుందన్నారు. వర్జిన్ కొబ్బరి నూనెతో సుసంపన్నమైన పారాచూట్ అడ్వాన్స్‌డ్ బేబీ నవజాత శిశువు చర్మం మాయిశ్చరైజింగ్ అవసరాలను తీర్చడానికి రూపొందించినట్లు పేర్కొన్నారు.

వేగన్ లెదర్ డిజైన్‌తో రియల్ మీ సి63

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రియల్ మీ వేగన్ లెదర్ డిజైన్‌తో సి 63 ను నూతనంగా విడుదల చేసిందని కంపెనీ ప్రతినిధి మీడియాకు తెలిపారు. రియల్ మీ సి 63 తక్కువ ధరకు లభించే స్మార్ట్ ఫోన్ అన్నారు. ఇది ఈ విభాగంలో వేగన్ లెదర్ డిజైన్‌తో వస్తుందని, స్టైల్, మన్నికను అందిస్తుందన్నారు. రియల్ మీ సి63 45 డబ్ల్యు వేగవంతమైన ఛార్జింగ్‌తో వచ్చిందన్నారు. రూ.8,999 ధరలో ఇది లభిస్తుందని తెలిపారు.

గెలాక్సీ జెడ్ సిరీస్ స్మార్ట్‌ఫోన్ రిజిస్ట్రేషన్లు ప్రారంభం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : గెలాక్సీ జెడ్ సిరీస్ ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్‌లను ముందస్తుగా రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా ముందస్తు యాక్సెస్ ప్రత్యేక ఆఫర్‌లను పొందేందుకు అర్హత పొందవచ్చని సాంసంగ్ మార్కెటింగ్ హెడ్ కుమార్ తెలిపారు. మదిలపాలెం సమీపంలోని సాంసంగ్ ఎక్స్ క్లూజివ్ షోరూమ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ సదుపాయం సాంసంగ్ వెబ్సైట్ తో పాటు, సాంసంగ్ ఎక్స్‌క్లూజివ్ స్టోర్ లోను అమెజాన్, ఫ్లిప్కార్ట్ లతోపాటు దేశవ్యాప్తంగా ప్రముఖ అవుట్ లెట్ లలో అందుబాటులో ఉందని వివరించారు. రూ.2000 చెల్లించడం ద్వారా కస్టమర్లు తమ ఫోన్‌ను రిజర్వ్ చేసుకోవచ్చని తెలిపారు. ముందస్తు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి రూ.7000 విలువైన ప్రయోజనాలు అందిస్తామని తెలిపారు.

శ్రమదానంతో పిచ్చిమొక్కల తొలగింపు


పిచ్చిమొక్కలు తొలగిస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని నల్లగొండ గ్రామంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక పెద్దలు, గ్రామస్తులు కలిసి శ్రమదానం చేసి గ్రామంలోనూ, రహదారి పక్కన ఉన్న పొదలను, పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు పల్లి అప్పారావు, జంపా లోవరాజు, పొట్టిక సింహాచలం, లోతా సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

కూటమి అధినేతల చిత్రపటాలకు పాలాభిషేకం


పాలాభిషేకం చేస్తున్న కూటమి నేతలు, కార్యకర్తలు

ప్రజాశక్తి-చింతూరు : రాష్ట్రంలో సామాజిక పింఛన్ల పెంపుపై హర్షం వ్యక్తం చేస్తూ చింతూరు టిడిపి కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి చిత్రపటాలకు టిడిపి నాయకులు సోమవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల వాగ్దానం ప్రకారంగా ఏప్రిల్ నెల నుండి పెంచిన బకాయి, జూలై నెల రూ.4000 మొత్తం కలిపి రూ.7000 ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఇలా చిన్నారెడ్డి, చిట్టి బాబు, మడివి రాజు, శీలం తమ్మయ్య, పొదిలి రామారావు, అని చంద్రయ్య, చదియన్ చిట్టిబాబు, మల్లెల వెంకటేశ్వరరావు, ఓబులేని నరసింహారావు, గడ్డం సురేష్ చౌదరి, ఓబులేని రామారావు, గుర్రం చిన్న ముత్తయ్య, సాయం రవి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

రజక వృత్తిదారుల హామీలను నెరవేర్చాలి

ప్రజాశక్తి మాధవధార : . ఎన్నికలకు ముందు రజక వృత్తిదారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఎపి రజక వత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి ఎం.ఈశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం. కంచరపాలెం సిఐటియు కార్యాలయంవద్ద రజక వృత్తిదారుల సంఘం సమావేశంలో మాట్లాడుతూ . కంచరపాలెం ప్రాంతంలో నివసించేందుకు రజకులకు పక్కాఇళ్లు, వృత్తిస్థలాలు, దోభీఘాట్లు మంజూరు చేయాలని, రజకుల రక్షణకు సామాజిక చట్టం చేయాలని, 50ఏళ్లు నిండిన వారికి పింఛన్లు మంజూరు చేయాలని, దోభీ పోస్టులను రజకులతోనే భర్తీ చేయాలని,. లాండ్రీలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ మంజూరు చేయాలన్నారు కార్యక్రమంలో ఎస్.ఈశ్వరరావు . బి చిన్నారావు, ఎం అప్పారావు, కె. శ్రీను, బి రాజారావు, ఎం తిరుపతిరావు పాల్గొన్నారు.

కొరటాల సత్యనారాయణకు ఘన నివాళి


కొరటాలకు నివాళులర్పిస్తున్న ప్రజాశక్తి జనరల్ మేనేజర్ వెంకటేశ్వరరావు, సిబ్బంది

ప్రజాశక్తి- విశాఖపట్నం : రైతు ఉద్యమ నేత, సిపిఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి, ఆ పార్టీ పొలిట్ బ్యూరో మాజీ సభ్యులు కామ్రేడ్ కొరటాల సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ కార్యాలయంలో ఆ సంస్థ సిబ్బంది సోమవారం ఘనంగా నివాళు లర్పించారు. ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు కొరటాల చిత్ర పటానికి పూలమాల వేయగా, సిబ్బంది పూలతో శ్రద్ధాంజలి ఘటించారు. ప్రజాశక్తి సబ్ ఎడిటర్ ఆర్‌కె.నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజాశక్తి సాహితీ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షునిగా కామ్రేడ్ కొరటాల సత్యనారాయణ ప్రజాశక్తి నడకకు, ఎదుగుదలకు విశేషంగా కృషి చేశారని కొనియాడారు. కొరటాల చూపిన మార్గంలో ప్రజాశక్తిని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి సిబ్బంది పాల్గొన్నారు.

'మధ్యాహ్న' భోజన అమలుపై సమీక్ష

ప్రజాశక్తి- సీతమ్మధార : నగరంలోని ప్రభుత్వ పాఠశాలలకు అక్షయపాత్ర సంస్థ ద్వారా మధ్యాహ్న భోజన పథకం అమలుపై విద్యాశాఖ, ఐసిడిఎస్, పౌరసరఫరాలు, జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులతో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం సమీక్షించారు. సోమవారం కప్పరాడలోని అక్షయపాత్ర కార్యాలయం వద్ద నిర్వహించిన సమీక్షలో ముందుగా వంట తయారీ కేంద్రాన్ని పరిశీలించారు, అక్కడ పరిస్థితులు, శుచి, శుభ్రత, వారికి ప్రభుత్వపరంగా సరఫరా చేస్తున్న సరుకులు, వాటి నాణ్యత, పరిమాణం తదితర అంశాలపై పరిశీలన చేశారు. నగరంలోఎన్నిపాఠశాలల్లో ఎంతమంది విద్యార్థులకు అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా మధ్యాహ్న భోజనం సరఫరా జరుగుతుంది, దాని అమలుపై విద్యాశాఖాధికారుల పర్యవేక్షణ, వాటికి సంబంధించిన రికార్డుల నిర్వహణ వంటి అంశాలపై అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన అమలుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారంలో సూచనలు చేశారు. పౌరసరఫరాల విభాగం ద్వారా బియ్యం, పప్పుదినుసుల పంపిణీపై ప్రశ్నించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన అమలుకు సంబంధించి సమస్యల నమోదుకు ప్రత్యేకంగా రిజిస్టర్ ఏర్పాటు చేయాలని, విద్యార్థుల తల్లిదండ్రులు భోజన అమలుపై తరచూ పర్యవేక్షణ జరిపి, మెనూ అమలు, ఇతర సమస్యలుంటే కమిషన్ దృష్టికి తీసుకురావాలన్నారు. పాఠశాలల్లోని వందశాతం విద్యార్థులు మధ్యాహ్నభోజనం తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు సమీక్షలో సివిల్ సప్లయిస్ డిఎం ఐ.రాజేశ్వరి, అక్షయపాత్ర మేనేజర్ వి.రామ్మోహన్, ఎంఇఒలు ఎ..సోమేశ్వరరావు, డి.దివాకర్, కెఎ.బాలామణి, విద్యాశాఖ ఎడిఎ .జ్యోతి, సిడిపిఒలు ఎంవిఆర్.కుమారి, శ్రీలత, జిల్లా బాలల సంక్షేమ విభాగం పిఒ రమేష్,అక్షయ పాత్ర ఆపరేషన్ మేనేజర్ కె.జానకిరాం, క్వాలిటీ విభాగం అధికారి సిహెచ్.విజయ కుమార్, సిఆర్‌ఎంటిలు, అంగన్వాడీ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

స్టెమ్ సెల్ మార్పిడితో సికిల్‌సెల్ ఎనీమియాకు చెక్!

రాష్ట్రంలోనే మొట్టమొదటి అరుదైన వైద్య ప్రక్రియ అపోలోలో విజయవంతం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆంధ్రప్రదేశ్‌లో స్టెమ్‌సెల్ మార్పిడితో సికిల్‌సెల్ అనీమియాను విజయవంతంగా ఆంధ్రాలోనే మొట్టమొదటిగా నయం చేయడం ద్వారా ఆరిలోవలోని అపోలో హాస్పిటల్, మెడికల్ ఆంకాలజీ వైద్యులు ఘనతను సాధించారు.

విశాఖకు చెందిన 16ఏళ్ల యువరాజు అనే బాలునికి నాలుగేళ్లనుంచే తీవ్రమైన సికిల్ సెల్ అనీమియాతో బాధపడుతున్నాడు. అతని వ్యాధి నోటి మందులకు ప్రతిస్పందించడం ఆగిపోయింది. అతను రక్తమార్పిడి, ఎముకల నొప్పి తగ్గించడం కోసం పదేపదే ఆసుపత్రిలోచేరి వైద్యసేవలు పొందక తప్పని పరిస్థితి. ఈ సమయంలో, అతని కుటుంబం విశాఖపట్నంలోని అపోలో హాస్పిటల్‌లో మెడికల్ ఆంకాలజీ సీనియర్ కన్సల్టెంట్ అండ్ బిఎంటి ఫిజిషియన్ డాక్టర్ రాకేష్‌రెడ్డి బోయను సంప్రదించారు.

రోగిని పూర్తిగా పరీక్షించిన తర్వాత అతనికున్న సికెల్‌సెల్ ఎనీమియా వ్యాధిని బోన్ మ్యారో (స్టెమ్ సెల్) మార్పిడి మాత్రమే నివారణ జరుగుతుందని డాక్టర్ రాకేష్ రెడ్డి బోయ వారికి వివరించారు. రోగి అన్నయ్యను దాతగా గుర్తించారు. అతని స్టెమ్‌సెల్స్ పూర్తిగా సరిపోలనప్పటికీ, కొన్ని మార్పులతో వాటిని సేకరించి వైద్యం చేయాలని అపోలో మెడికల్ ఆంకాలజీవైద్యులు భావించారు. అధిక మోతాదు కీమోథెరపీని నివారించడానికి తగు జాగ్రత్తలు తీసుకుంటూనే, రేడియేషన్‌తో శరీర రోగనిరోధక శక్తిని అణిచివేసేందుకు కాంపత్ ఉపయోగించారు. స్టెమ్ సెల్స్ పోస్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్ రెండు నెలల తర్వాత బాధిత బాలుడు యువరాజు సికిల్ సెల్ అనీమియా సమస్యలు లేకుండా కోలుకున్నాడు. ఈ సందర్భంఆ డాక్టర్ రాకేష్‌రెడ్డి బోయ అపోలో ఆసుపత్రుల యాజమాన్యనికి రోగి కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా స్టెమ్ సెల్స్‌తో సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిని కట్టడిచేసే అరుదైన వైద్యప్రక్రియలో డాక్టర్ రాకేష్‌రెడ్డితోఆపటు డాక్టర్ ప్రదీప్ వెంట్రపతి, డాక్టర్ సుమన్ దాస్, డాక్టర్ వేణి ప్రసన్న గేదల , డాక్టర్. రహీం, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ బోల్తా పడి వ్యక్తికి తీవ్ర గాయాలు


క్షతగాత్రునికి చికిత్స చేస్తున్న అంబులెన్స్ సిబ్బంది

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం దుప్పిలి వాడ పంచాయతీ పరిధి పిల్లిగెడ్డ గ్రామం వద్ద ద్విచక్ర వాహనం బోల్తా పడి అదే పంచాయతీ పరిధి చల్లనచిలప గ్రామానికి చెందిన కేలేబు రాజుబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. రాజుబాబు మల్కనగిరి జిల్లా చిత్రకొండ మండలంలో వారపు సంతకు ఆదివారం వెళ్లారు. పనులు ముగించుకుని ఆదివారం రాత్రి చిత్రకొండ నుంచి తిరిగి ద్విచక్ర వాహనంపై వస్తుండగా పిల్లిగెడ్డ గ్రామం దగ్గరకు వచ్చే సరికి బైకు అదుపుతప్పి బోల్తా కొట్టడంతో రాజుబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. ఆ సమయంలో ఈ సంఘటన చూసిన పిల్లిగడ్డ గ్రామ మహిళలు ఆశా కార్యకర్తకు తెలియజేసి ఆసుపత్రికి సమాచారం అందించారు. వెంటనే అంబులెన్స్‌తో సంఘటనా స్థలానికి సిబ్బంది రవిచంద్ర, గణేష్ వచ్చి రాజుబాబుకు ప్రథమ చికిత్స అందించి సీలేరు పిహెచ్‌సికి తరలించారు.

రేషన్ పంపిణీ పరిశీలన


రేషన్ పంపిణీ పరిశీలిస్తున్న తహాశీల్దార్

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని రాజపేట పంచాయతీలో రేషన్ లబ్ధిదారులకు సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని తహాశీల్దారు సోమవారం పరిశీలించారు. నిత్యావసర సరుకులు పంపిణీ విషయంలో ఎలాంటి అవకతవకలు లేకుండా పంపిణీ చేయాలని ఆదేశించారు.

జన్యువ్యాధుల చికిత్సకు ఎల్‌విపిఇఐ పరిశోధన

ప్రజాశక్తి - ఆరిలోవ : కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ జినోమిక్స్ అండ్ ఇంటిగ్రేటివ్ బయాలజీ, ఎల్‌వి. ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతికత కంటే మరింత ఆధునిక, సమర్ధవంతమైన జన్యు వవరణ సాధనాన్ని పరీక్షించారు. డాక్టర్ ఇందుమతి మారియప్పన్ నేతృత్వంలో ఎల్‌విపిఇఐ పరిశోధకులు ఈ కొత్త సాధనాన్ని చిన్న వయస్సులోనే తీవ్రమైన దృష్టి లోపానికి దారితీసిన లెబర్స్ కాంజినీటల్ అమౌరోసిస్ టైప్ -2 అనే అరుదైన, జన్యుపర కంటివ్యాధి ఉన్న రోగి నుంచి తీసుకున్న కణాలలో పరీక్షించారు. ఈ వ్యాధి కంటిలో సాధారణ ప్రొటీన్ ఉత్పత్తికి అంతరాయం కలిగించే ఒక జన్యు పరివర్తన కారణంగా వస్తుంది. ఎల:విపిఇఐ బృందం రోగి చర్మ కణాలను తీసుకొని, అదే జన్యు పరివర్తనాన్ని కలిగిన స్టెమ్ సెల్స్‌గా వాటిని పునర్వ్యవస్థీకరించారు. తరువాత వారు స్టెమ్ సెల్స్‌లో పరివర్తనాన్ని సరిచేసేందుకు ఇఎన్ఎఫ్ఎన్‌సిఎఎస్9 సాధనాన్ని ఉపయోగించారు. సరిచేసిన కణాలు పరివర్తనం విజయవంతంగా పరిష్కరించిపడిందని నిరూపిస్తూ, మళ్ళీ సాధారణ ప్రొటీన్ ఉత్పత్తి చేయగలియాని నిరూపించినట్టు డాక్టర్ మరియప్పన్ తెలిపారు.